క్లుప్తంగా

ఇంధన ధరలను తగ్గించాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

కర్నూలు(సెంట్రల్): పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని గోకారి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్ ధరలపై సెస్సును వెంటనే ఎత్తివేయాలన్నారు. ఇప్పటికే పెరిగిన గ్యాస్, పెట్రో ఉత్పత్తుల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతుంటే ఈ సమయంలో ధరలను పెంచడం అన్యాయమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పేదలపై విపరీతమైన భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కిస్తీలు



ఎద్ల బండిపై ప్రసాదం తీసుకెళుతున్న గురువులు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామ శివారులో వెలసిన హజరత్ అల్లబకాష్ మియ్యా వలి ఉరుసు సందర్భంగా బుధవారం భక్తిశ్రద్ధలతో కిస్తీలు నిర్వహించారు. సాయంత్రం గురువుల వారి ఇంటి నుంచి ఎద్దుల బండిపై ప్రసాదాలను దర్గా వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు దర్గా గురువులు మహబూబ్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కురువ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయం మండపం వద్ద తాలుక అర్బన్ పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దల సమక్షంలో అధికారులు ఈ లెక్కింపు చేపట్టారు. ఇందులో 2 నెలల 15 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మెత్తం రూ.16,39,379 ఆదాయం వచ్చినట్లు వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారి ఎన్.సీతారామిరెడ్డి, గార్గేయపురం ఏపీజీపీ ఫీల్డ్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఆలయ పూజారులు చిన్నయ్య, నారాయణ, యల్లరాజు, బాలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధులను మెరుగు పర్చుకోవాలి



జీవనోపాధులపై చర్చిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

కల్లూరు: పొదుపు సంఘాల సభ్యులు జీవనోపాధులను మెరుగు పర్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి సూచించారు. బుధవారం చిన్నటేకూరులో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పొదుపు సంఘాల సభ్యులు వారి జీవనోపాధుల కొరకు ఆర్థికంగా ఎంత అవసరం అనే దానిమీద సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వేను ఎన్యూమారేటర్లు ఏ విధంగా చేస్తున్నారని పొదుపు మహిళలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం పుష్పావతి, డీఆర్‌డీఏ సిబ్బంది, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిలో శిక్షణ

మద్దికెర: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన యువతీ, యువకులకు టైలరింగ్, మగ్గం, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, బ్యూటీ పార్లర్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కంప్యూటర్ ట్యాలీ వంటి కోర్సుల్లో 38 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పుష్ప ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. 18 – 45 సంవత్సరాలలోపు వయస్సున్నవారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచితంగా భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నాలుగు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కెనరా బ్యాంకు, గ్రామీణ స్వయంపాధి శిక్షణ సంస్థ, డీఆర్‌డీఏ ఆఫీస్ పక్కన, బి.తాండ్రపాడులో సంప్రదించాలని, అలాగే.. సెల్: 9000710508, 6304491236 నంబర్లకు కాల్ చేయాలని కోరారు.

చేదు రోగాలకు తీపి వైద్యం

- హోమియోకు పెరుగుతున్న ఆదరణ
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 22 ప్రభుత్వ డిస్పెన్సరీలు
- అన్ని చోట్లా ఉచితంగా చికిత్స, మందులు
- దీర్ఘకాలిక, మొండి రోగాలకు ఉత్తమ చికిత్స
- నేడు వరల్డ్ హోమియో డే



కర్నూలు(హాస్పిటల్): రోగమొస్తే దాని బాధ కన్నా మందులు మింగడం చాలా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే వేసుకునే మందుల పరిమాణం, రుచి చాలా మందికి రుచించదు. దీనికితోడు అవి వేసుకున్నాక కొందరికి సైడ్ ఎఫెక్ట్స్ రూపేణా మరిన్ని ఇబ్బందులు వస్తుంటాయి. ఇలాంటి ఇబ్బందులేమీ లేకుండా నోట్లో వేసుకుంటేనే తియ్యగా చప్పరిస్తూ మింగేవే హోమియోపతి మందులు. జర్మనీ దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హనిమన్ మొదటిసారిగా హోమియో విధానాన్ని కనుగొన్నారు. ఆయన జన్మదినానికి గుర్తుగా ఏటా ఏప్రిల్ 10న హోమియో డేగా జరుపుకుంటారు.

జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 12 రెగ్యులర్, 10 ఎన్‌హెచ్‌ఎం కలిపి మొత్తం 22 హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా డిస్పెన్సరీలకు ప్రతిరోజూ 40 నుంచి 60 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్‌లాంటి చోట్ల ఓపీ రోగుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. అన్ని డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్నాయి. ఇక్కడ చికిత్సతో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ఇతర వైద్య విధానాల్లో మందులు వాడి విసుగు చెందిన వారు హోమియోవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు కర్నూలు నగరంలోనే 20 దాకా కార్పొరేట్ సంస్థల క్లినిక్‌లు ఉండగా, స్థానిక వైద్యులు మరో 600 మంది దాకా ఉంటారు. ఈ వైద్యవిధానంలో దీర్ఘకాలిక నొప్పి, అలర్జీలు, జీర్ణకోశ వ్యాధులతో సహా మందులు ప్రభావవంతంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ వైద్యంగా ఆదరణ

హోమియో వైద్య విధానంలో మొండి రోగాలకు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాల్లో నయం కాని వారు హోమియోకు వచ్చి చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకుని వెళ్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నడుం నొప్పులు, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, తరచూ వచ్చే చీముగడ్డలు, గజ్జి, తామర, ఎగ్జిమా, చెవిలో చీము కారడం ,ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, సైనసైటిస్, నాజిల్ పాలిప్స్, గ్యాస్ట్రబుల్, మలబద్దకం, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, పసిరికలు, అమీబియాసిస్, నరాల సంబంధిత వ్యాధులు (సయాటిక, సర్వికల్ స్పాండిలోసిస్, లాంబార్ స్పాండిలైసిస్), కిడ్నీలో రాళ్లు, పలు రకాల అలర్జీలు, మైగ్రేన్లు, డిప్రెషన్, క్రానిక్ ఫెటిగ్ సిండ్రోమ్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ప్రకోప ప్రేగు సిండ్రోమ్, ప్రీమెన్‌స్ట్రసల్ సిండ్రోమ్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియో మందులు ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

హోమియోపతికి పెరుగుతున్న ఆదరణ



జిల్లాలో హోమియోపతి వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాలకు ప్రత్యామ్నాయంగా ఆదరణ పొందుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీల్లో ప్రతి సంవత్సరం రోగుల సంఖ్య పెరుగుతోంది. హోమియో డిస్పెన్సరీల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స, మందులు అందిస్తున్నాం. వరల్డ్ హోమియో డే పురస్కరించుకుని 10వ తేదీన అన్ని డిస్పెన్సరీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

– డాక్టర్ డి.మహదేవరావు,
జిల్లా ఆయుష్ అధికారి, కర్నూలు

వ్యాధిమూలంపై హోమియో చికిత్స



హోమియోపతి మందుల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఆపరేషన్ అవసరం లేకుండా దీర్ఘకాలంగా వేధిస్తున్న ఆరోగ్య సమస్యలను దీని ద్వారా పరిష్కరించవచ్చు. ముఖ్యంగా థైరాయిడ్, పీసీఓడీ, సొరియాసిస్, వెన్ను, కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్, మానసిక సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలను హోమియో ద్వారా శాశ్వతంగా నివారించవచ్చు. ముందుగా రోగి మానసిక, శారీరక లక్షణాలు పరిగణలోకి తీసుకుని తగిన విధంగా కౌన్సెలింగ్ అందిస్తాం. వ్యాధి మూలకారణాలను గుర్తించి రోగికి మెరుగైన వైద్యం అందిస్తాం.

–డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్,
హోమియో వైద్యులు, కర్నూలు

అక్రమాలపై విచారణకు ఆదేశం

కర్నూలు(సెంట్రల్): ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కై మామూళ్లు తీసుకుంటున్నారని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రనాయుడు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌ను విచారణాధికారిగా జిల్లా కలెక్టర్ నియమించారు. ఈనెల 17వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఎస్‌ఎస్‌పీ కార్యాలయంలో విచారణ జరుగుతుందని, ఇందుకు సంబంధించి ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, ఫిర్యాదుదారుడు విచారణకు హాజరుకావాలని ఉత్తర్వులు ఇచ్చారు.

ఆ భవనాలను ఉర్దూ వర్సిటీకి ఇవ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల భవనాలను ఉర్దూ యూనివర్సిటీకి అప్పగించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఒకే కాంపౌండ్‌లో డిగ్రీ కళాశాల, ఉర్దూ యూనివర్సిటీని ఎలా నడపుతారని ఉన్నత విద్యా మండలిని ప్రశ్నించారు. ఈ ప్రతిపాదనను విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నా ఉన్నత విద్యామండలి డైరెక్టర్ కోన శశిధర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు.

వెట్‌ల్యాండ్‌లను గుర్తించి నివేదిక ఇవ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (సెంట్రల్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో గుర్తించిన వెట్‌ల్యాండ్‌లపై నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వెట్‌ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వెట్‌ల్యాండ్ రూల్స్ 2017 ప్రకారం జిల్లాలో వెట్ ల్యాండ్ సంరక్షణ, నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలు సహజమైన లేదా కృత్రిమ, శాశ్వతమైన లేదా తాత్కాలిక, స్థిరమైన లేదా ప్రవహించే, తాజా, సముద్ర నీటి ప్రాంతాలతో సహా, తక్కువ అలల లోతు ఆరు మీటర్లు గల నీటి సముదాయాలను వెట్ ల్యాండ్ కింద పరిగణించబడుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న వెట్‌ల్యాండ్ వివరాలను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో 333 వెట్‌ల్యాండ్స్ ఉన్నట్లు స్పేస్ అప్లికేషన్ సెంటర్ అట్లాస్ గుర్తించిందని, ఆ మేరకు భూముల సరిహద్దులతో పాటు గ్రౌండ్ ట్రూథింగ్ తదితర వివరాలతో వారంలోపు నివేదిక సమర్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సభ్యులు జేసీ డాక్టర్ బి.నవ్య, డీఎఫ్‌ఓ శ్యామల, ఇరిగేషన్ ఎస్‌ఈ ద్వారకనాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీఏఓ వరలక్ష్మి, డీపీఓ భాస్కర్, అదనపు కమిషనర్ కృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ కిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి విజయ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలల అక్రమాలపై చర్యలేవీ?

కర్నూలు కల్చరల్: నిబంధనలు పాటించకుండా అక్రమాలకు పాల్పడుతున్న రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఈడీ కళాశాలల అక్రమాలపై వర్సిటీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వర్సిటీ అధికారులు కాసులకు అమ్ముడుపోవడం వల్లే బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇలాగే వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నాయకులు ఈశ్వర్, యశ్వంత్, పవన్, సునీల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలతో మోసం చేస్తున్నారు

కర్నూలు(హాస్పిటల్): ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్న వీ కేర్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని వీ కేర్ సెంటర్ వద్ద ఏఐవైఎఫ్ నాయకులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. వీ కేర్ సెంటర్ యాజమాన్యం అందమైన బ్రోచర్లు, వీడియోలతో యువతను ఆకర్షించి వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. చిన్న సమస్యతో వెళ్లిన వారికి కౌన్సిలింగ్ రూపంలో మాయమాటలు చెప్పి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు అఖిల, శివ, మద్దిలేటి, కాశిం, కృష్ణ, రవి, బాబ్జి, శివరాముడు, రామచంద్రుడు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆలూరు రూరల్: పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహబూబ్ బాషా బుధవారం సాయంత్రం తెలిపారు. పెద్దహోతూరు గ్రామ సమీప పొలాల్లో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించగా గ్రామానికి చెందిన 11 మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.20,060 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేక ముక్కలతో పాటు 9 సెల్ ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పార్కుల కోసం నదులను ఆక్రమించొద్దు



హంద్రీ నదిని పరిశీలిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆహ్లాదం పేరుతో పార్కుల కోసం నదులను ఆక్రమించొద్దని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు మునిసిపల్ ఉద్యోగులకు సూచించారు. బుధవారం ఆనంద్ థియేటర్ సమీపంలో పార్కు కోసం నదిని ఆక్రమించిన ప్రాంతాన్ని పరిశీలించారు. పార్కుల కోసం నదులను ఆక్రమిస్తే వరదలు వచ్చిన సమయంలో ఇళ్లలోకి నీరు చేరి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నదుల ఆక్రమణపై వెనక్కి తగ్గకపోతే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, రంగప్ప, నాగరాజు, అమర్, మధు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సి.గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 20, 21 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో జరిగే ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఏడో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న అధ్యక్షతన రజకుల సమస్యలపై చర్చావేదిక ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన గురుశేఖర్ మాట్లాడుతూ.. రజకుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. నాయకులు శేషాద్రి, జయమ్మ, రాముడు,పర్లసుంకన్న, శేఖర్‌బాబు,చిత్తారి వీధి శీను పాల్గొన్నారు.

సివిల్ సప్లై గోదాము తనిఖీ



స్టాకు వివరాలపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

కోడుమూరు రూరల్: గూడూరులోని సివిల్ సప్లై గోదామును బుధవారం కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో నిల్వవున్న బియ్యం, చక్కెర, ఐసీడీఎస్‌కు సంబంధించిన సరుకుల వివరాలను పరిశీలించి నమోదు చేసుకున్నారు. అలాగే నెలనెలా రేషన్ దుకాణాల డీలర్లకు సరుకులను సకాలంలో పంపించాలని, తప్పనిసరిగా తూకం వేసిన తర్వాతనే సరుకులను డీలర్లకు చేరవేయాలని ఆర్డీఓ సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. గూడూరు తహసీల్దార్ రామాంజనేయులు, సీఎస్ డీటీ నవీన్‌కుమార్, గోదాము ఇన్‌చార్జ్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై దేవదేవుడి విహారం

వెల్దుర్తి: రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం స్వామి అమ్మవార్లకు నిర్వాహకులు శేషవాహన సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వనం వెంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఏడు తలల శేషవాహనంపై ఆశీనులు గావించి మంగళవాయిద్యాలతో ఊరేగించారు. దాస్యభక్తికి నిదర్శనం శేషవాహనమని, ఆ భక్తితో మనిషిలో పశుత్వం తొలగి మానవత్వం, దాని నుంచి దైవత్వం, ఆపై పరమపదం సిద్ధిస్తుందని పండితులు తెలిపారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పేదలకు కూడు, గూడు కోసం పోరాటాలు చేసిన వ్యక్తిగా చంద్ర రాజేశ్వరరావు చరిత్రలో మిగిలిపోతారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. చంద్ర రాజేశ్వరరావు జయంతి పురస్కరించుకొని బుధవారం సీఆర్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి జిల్లా సమితి తరపున పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జమీందారి కుటుంబంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు పేదల కోసం తన యావదాస్తిని దానం చేసి తుది శ్వాస వరకు పోరాటాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో భూ పోరాటాలు చేస్తూనే ఉంటామని చెప్పారు. నాయకులు పి.రామకృష్ణారెడ్డి, లెనిన్‌బాబు, మహేష్, శ్రీనివాసులు, వెంకటేశ్, నాగరాజు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	2727	6500
పొద్దుతిరుగుడు	4769	5169
ఆముదం	5490	6079
వాము	2000	23350
ఉల్లి	515	1309
ఎండుమిర్చి	4800	11555
శనగలు	3510	5719
కందులు	2100	7056
మొక్కజొన్న	1439	2192
మినుములు	1409	7309
కొర్రలు	1789	2569
సోయాచిక్కుడు	1596	3869
సజ్జలు	2219	2219

ఫోన్: 08518-257204, 257661

'సుంకన్నకు ఐఎన్‌టీయూసీతో సంబంధం లేదు'

కర్నూలు(సెంట్రల్): సుంకన్నకు ఐఎన్‌టీయూసీతో ఎలాంటి సంబంధం లేదని, ఆయనతో ఎవరూ ఐఎన్‌టీయూసీకి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించకూడదని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు బతుకన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐఎన్‌టీయూసీలో సభ్యత్వం లేని వారు సంస్థ తరఫున మాట్లాడడం, కార్యక్రమాలను నిర్వహించడం చేయరాదన్నారు. అలా చేస్తే సంస్థ తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఓటర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- కర్నూలు నియోజకవర్గ ఆర్‌ఓ, కమిషనర్ రవీంద్రబాబు



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన ఓటర్ల సమస్యలను పరిష్కరిస్తామని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పురోగతిని సమావేశంలో ఆర్‌ఓ వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వెంకటరమణ కాలనీలోని ఓటర్లు కిడ్స్ వరల్డ్ సమీపంలోని పోలింగ్ బూత్‌లో ఉన్నట్లు, ఇందిరమ్మ కాలనీలోని పోలింగ్ కేంద్రం లేదంటూ వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. జొహరాపురం ఇందిరమ్మ కాలనీలో 969 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని, కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లకు అందుబాటులో పోలింగ్ కేంద్రం ఉండే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసిస్టెంట్ ఆర్‌ఓ వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంఆర్‌ఓ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉండాలి



సీపీఆర్ చేసే పద్ధతిని వివరిస్తున్న వైద్యులు

కర్నూలు కల్చరల్: అకస్మాత్తుగా తలెత్తే ఆరోగ్య సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సూచించారు. బుధవారం వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాలలో మెడికల్ క్యాంప్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ డాక్టర్ ఎం.మనోజ్‌కుమార్ అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేసి రోగుల ప్రాణాలను ఏ విధంగా కాపాడాలో ప్రయోగాత్మకంగా వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ వెంకటకృష్ణుడు మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు కేవీ రత్నం, శివప్రసాద్, నాగచంద్రుడు, విజయుడు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



సి.బెళగల్‌లో వీసీకి హాజరైన ప్రత్యేకాధికారి రంగనాథరావు

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ రంగనాథరావు సూచించారు. బుధవారం ఎంపీడీఓ రాణెమ్మ, ఇతర మండల అధికారులతో కలిసి డీడీ వీడియో కాన్ఫరెన్స్ (వీసీ)కి హాజరయ్యారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో గ్రామాలలో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అధికార యంత్రాంగం రెగ్యులర్‌గా విధులకు హాజరై గ్రామాలను సందర్శించాలని, పల్లెల్లో ప్రజల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అధికారులు ముందస్తు అనుమతి, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ తాగునీరు, రీసర్వే, గ్రామీణ అభివృద్ధి, ఉపాధిహామీ, హౌసింగ్ తదితర శాఖలలో ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలు, పీజీఆర్‌ఎస్‌లో నమోదవుతున్న సమస్యలపై చర్చించారు.సమీక్షలో ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోసేనాయక్, సుమంత్, ఎంఈఓ – 2 ఆదాంబాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, ఉపాధిహామీ ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు ఉన్నారు.

పకడ్బందీగా పోషణ పక్షం అమలు

కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషణ లోపం నివారణ కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పోషణ పక్షం పక్కగా అమలు చేయాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బుధవారం పెద్దటేకూరులో సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ లోపాన్ని నివారించడమే లక్ష్యంగా పోషణ పక్షం ఈ నెల 8 నుంచి 22వ వరకు నిర్వహిస్తున్నారన్నారు. గర్భిణుల బరువు లెక్కించడము, పిల్లల ఎదుగుదల, వ్యాధి నిరోధక టీకాలు, తల్లిపాల అవశ్యకత, శిశువుల సంరక్షణకు పాటించవలసిన పరిశుభ్రతపై ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎమ్‌లు అవగాహన కల్పించాలన్నారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ



కోడుమూరు ఎస్సీ హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను బుధవారం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో హాస్టల్లో జూనియర్‌లపై సీనియర్ విద్యార్థి దాడి చేసిన ఘటనపై విద్యార్థులతో మాట్లాడారు. అలాగే హాస్టల్లో మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, నాణ్యత ఎలా ఉంది, వసతులు బాగున్నాయా, పరీక్షలు ఎలా రాస్తున్నారంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎంతమంది సిబ్బంది ఉన్నారు, జూనియర్‌లపై సీనియర్ విద్యార్థి దాడి చేసిన రోజు విధుల్లో ఎవరు ఉన్నారన్న విషయాలపై హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్ వలితో చర్చించారు.

